క్లుప్తంగా

పాఠశాలకు వంట సామగ్రి అందజేత



తోటగరువు ఎంపీపీ స్కూల్‌లో వంట సామగ్రి అందిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ఆరిలోవ: మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన వంట సామగ్రిని చినగదిలి మండలంలోని పాఠశాలలకు ప్రభుత్వం సరఫరా చేసింది. ఇందులో భాగంగా తోటగరువు ప్రాథమిక పాఠశాల మిడ్ డే మీల్ కార్మికులకు అవసరమైన వంట సామాన్లను గురువారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అందజేశారు. అలాగే విద్యార్థులకు అవసరమైన క్రీడా సామగ్రిని కూడా అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ్, ఉపాధ్యాయులు, మిడ్ డే మీల్ కార్మికులు పాల్గొన్నారు.

ఐఐఎంలో 'పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్' ప్రారంభం



రైల్వే డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఐఐఎం ప్రతినిధులు

ఏయూ క్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం ఆధ్వర్యంలో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్(సీవీసీ) సహకారంతో నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ప్రభుత్వ రంగ విభాగాలలో పని చేస్తున్న 33 మంది ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన వాల్తేర్ రైల్వే డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రొక్యూర్‌మెంట్ సేవలకు సంబంధించి మెరుగైన అవగాహన పొందడానికి ఈ కార్యక్రమం ఉపకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొగ్రాం డైరెక్టర్ ఆచార్య ఎస్.చటర్జీ, తదితరులు పాల్గొన్నారు.

బీవీకేలో దసరా వేడుకలు



బీవీకే పాఠశాలలో వివిధ వేషధారణలో చిన్నారులు

ఆరిలోవ: విశాలాక్షినగర్ బీవీకే పాఠశాలలో గురువారం దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇక్కడ బొమ్మల కొలువు ఏర్పాటు చేసి దుర్గాదేవి పూజ చేశారు. అనంతరం విద్యార్థులు వివిధ వేషధారణలో దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు.

పుసకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు

బీచ్ రోడ్డు: భాషావేత్త డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ రచించిన ×పైడోగ్తల్లి: ది గాడెస్, ది హోలీ స్పిరిట్×పుస్తకాన్ని మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు గురువారం ఆవిష్కరించారు. సాహిత్యం, ఆధ్యాత్మికతకు సంబంధించిన ఈ పుస్తకాన్ని సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్, స్పీచ్ రికగ్నిషన్ ఎక్స్‌పోనెంట్ చల్లా సుస్మిత రచించారు. ఈ పుస్తకం ఆధ్యాత్మిక మేధస్సు, కుక్కురా భక్తి (కోనల భక్తి), పైడోగ్తల్లి అనే గిరిజన దేవత పురాణాన్ని లోతుగా పరిశోధించే రచనగా గుర్తింపు పొందింది. పుస్తకావిష్కరణ సందర్భంగా గవర్నర్ హరిబాబు మాట్లాడుతూ రచయితల అంకితభావాన్ని కొనియాడారు.

ఆరోగ్య సురక్ష.. పేదలకు రక్ష

- భానునగర్‌లోని వైద్య శిబిరానికి విశేష స్పందన
- 1350 మందికి వైద్య పరీక్షలు
- మెరుగైన వైద్య పరీక్షలకు 21 మంది రిఫర్



పరీక్షిస్తున్న వైద్యుడు



వైద్య శిబిరంలో వైద్య పరీక్షలకు పేర్లు నమోదు చేసుకుంటున్న జనం



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో బుక్‌లెట్ ప్రదర్శిస్తున్న అధికారులు, కార్పొరేటర్ శ్రీవిద్య



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న సీడీఎంఏ పి.కోటేశ్వరరావు

మద్దిలపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. జీవీఎంసీ 15, 16 వార్డుల్లోని మూడు సచివాలయాలకు సంబంధించి గురువారం భానునగర్ జీవీఎంసీ స్కూల్‌లో మద్దిలపాలెం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, ఏడీసీ సన్యాసిరావు, బయాలజిస్ట్ సాంబమూర్తి ప్రారంభించారు. అనంతరం ఈ శిబిరాన్ని జిల్లా ప్రత్యేక అధికారి, కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పి.కోటేశ్వరరావు సందర్శించారు. శిబిరానికి వచ్చిన వృద్ధులతో ఆయన మాట్లాడి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన అన్ని విభాగాలను పరిశీలించి, వైద్య పరీక్షల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రజలకు శ్రీరామరక్షగా నిలుస్తాయన్నారు. కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

- ఈ శిబిరంలో ఏడుగురు స్పెషలిస్ట్ వైద్యులు పరీక్షలు చేశారు. ఛెస్ట్, ఆర్థో, పీడియాట్రిక్, ఆప్తామాలజీ, గైనిక్, డెంటల్, జనరల్ మెడిసిన్ వైద్యులు సేవలు అందించారు. ఇద్దరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు కూడా పరీక్షలు చేశారు. 15వ వార్డు కొత్త వెంకోజీపాలెం -1, 16వ వార్డు రజకవీధి, ప్రియదర్శిని కాలనీల ప్రజలు ఈ శిబిరంలో వైద్య సేవలు పొందారు. సుమారు 1350 మందికి పరీక్షలు చేశామని మద్దిలపాలెం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.రెహినిషా తెలిపారు. వారిలో 21 మందిని మెరుగైన వైద్యం కోసం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, సన్యాసిరావు, ఎస్.ఎస్.వర్మ, సీఎంహెచ్‌వో నరేష్, డీపీవో చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు బాగున్నాయి..



కొద్ది రోజులుగా ఒంట్లో బాగో లేదు. వైద్యం చేసుకోవడానికి పెద్దాస్పత్రికి వెళ్లే స్తోమత లేదు. అలాంటి సమయంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిసింది. పెద్ద డాక్టర్లు వచ్చారు. వైద్య పరీక్షలు చేశారు. ఇంటి దగ్గరే ఆరోగ్య పరీక్షలు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఇలాంటి శిబిరాలు మరిన్ని ఏర్పాటు చేయాలి.

– ఎం.నరసమ్మ, రజకవీధి, చైతన్యనగర్

ఇంటి వద్దకే పెద్ద డాక్టర్లు వచ్చారు..



వైద్య సేవల కోసం ఎక్కడో ఉన్న కేజీహెచ్‌కు వెళ్లడం కష్టంగా ఉండేది. ఇప్పుడు ఏకంగా ఇంటి వద్దకు పెద్ద డాక్టర్లు వచ్చారు. సంతోషంగా ఉంది. ఇక్కడ అన్ని రకాల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన మందులు ఉచితంగా అందించారు.

– ఎల్లయ్య, ప్రియదర్శిని కాలనీ

ఔట్‌సోర్సింగ్ కార్మికులకు న్యాయం చేయాలి



వైఎస్సార్‌సీపీ ఫ్లోర్‌లీడర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్



డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్

డాబాగార్డెన్స్ : రైవాడ కెనాల్‌లో నీటిలో పని చేస్తున్న 105 మంది అన్‌స్కిల్డ్ వర్కర్లకు రూ.15 నుంచి రూ.18,500కి జీతం పెంచాలని, అన్‌స్కిల్డ్‌గా పని చేస్తూ పదేళ్ల అనుభవం ఉండి, ఐటీఐ సర్టిఫికెట్ కలిగిన 119 మందికి కూడా రూ.15 వేల నుంచి రూ.18,500కి జీతం పెంచేలా కౌన్సిల్‌లో ఆమోదం తెలిపి ప్రభుత్వానికి పంపాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్. సత్యం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావును వారి చాంబర్లలో కలిసి వినతిపత్రం అందజేశారు.

ఏయూలో స్వచ్ఛభారత్



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గణిత శాస్త్ర విభాగ ఆవరణలో గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. గణిత శాస్త్ర, స్టాటిస్టిక్స్, అప్లైడ్ మ్యాథమెటిక్స్ విభాగ విద్యార్థులు, ఆచార్యులు సంయుక్తంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ మూడు విభాగాల ఆవరణలో ఉన్న చెత్తా చెదారం, పిచ్చి మొక్కలు, పనికిరాని వస్తువులను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో దాదాపు 200 మంది విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్, ఆచార్యులు పాల్గొన్నారు.

పరిశోధన రంగంలో రాణించాలి

- నూతన ఔషధాలను అన్వేషించాలి
- ఘనంగా ఫార్మా-డీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



పట్టాలు అందుకున్న ఫార్మా-డీ విద్యార్థులతో రిజిస్ట్రార్ స్టీఫెన్ తదితరులు

ఏయూక్యాంపస్ : ఫార్మా-డీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు పరిశోధన రంగంలో రాణించాలని కేజీహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ కోరారు. గురువారం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఫార్మా-డీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ నూతన ఔషధాలు, మూలకాల అన్వేషణ జరిపే దిశగా కృషి చేయాలని సూచించారు. వైద్యులతో అనుసంధానంగా పనిచేయాలన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన తరువాత సమాజానికి మనం ఏ విధంగా ఉపయోగపడగలం అనే ఆలోచన కలిగి ఉండాలన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ వైద్యునికి, రోగికి మధ్య అనుసంధానంగా ఫార్మా-డీ విద్యార్థులు నిలుస్తారన్నారు. ఔషధాలకు సంబంధించిన చట్టాలపై ఏపీ డ్రగ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.విజయ్ కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆచార్య జి.శశిభూషణ రావు, ఆచార్య కేవీ రమణ మూర్తి, ఆచార్య జి.గిరిజా శంకర్, వి.గిరిజా శాస్త్రి, కె.ఈశ్వరకుమార్, ఏకేఎం పవార్, శైలజ పాల్గొన్నారు. వేడుకలు తిలకించడానికి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేకంగా విందును ఏర్పాటు చేశారు.

మందుల వినియోగంపై కేంద్ర కమిటీ ఆరా



గొల్లలపాలెం పాఠశాలలో వివరాలు సేకరిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీలో గురువారం ఇద్దరు వైద్యులతో కూడిన కేంద్ర పబ్లిక్ రిలేషన్స్ కమిటీ పర్యటించింది. కేరళకు చెందిన వైద్యులు సజిత, అనితకుమారి ఈ బృందంలో ఉన్నారు. వీరు పంచాయతీలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఆరోగ్య సిబ్బంది ఎలాంటి మందులు ఇస్తున్నారు, ఏఏ పరీక్షలు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. తర్వాత పంచాయతీలోని ప్రజలతో వైద్య చికిత్సల గురించి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వినియోగిస్తున్న మందుల గురించి ఆరా తీశారు. ఈ వివరాలతో నివేదిక తయారు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ జీవనరాణి, తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు, సర్పంచ్ పాట్నూరు ఛాయాగౌతమి, ఎంపీటీసీ పల్లా నీలిమ, ఎస్‌వో మురళీకృష్ణ, ఈవో రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్‌ను జీవీఎంసీయే నిర్వహించాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం : ఆర్కే బీచ్ సమీప స్విమ్మింగ్ పూల్‌ను జీవీఎంసీయే నిర్వహించాలని కోరుతూ సీపీఎం మద్దిలపాలెం జోన్ నాయకులు గురువారం ఆక్వా కాంప్లెక్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్లకార్డులు చేతపట్టి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్ మాట్లాడుతూ రూ.2.5 కోట్లతో నిర్మించిన స్విమ్మింగ్ పూల్‌ను మూడేళ్లకు లీజు ఇవ్వాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. దీన్నిపై వస్తున్న ఆరోపణలు నివృత్తి చేయాలని కోరారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

బీచ్ రోడ్డు: పేకాట ఆడుతున్న 8 మందిని మూడో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. రామ్‌నగర్‌లో జూదం ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు గురువారం దాడులు చేశారు. ఎనిమిది మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.32 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కోరాడ రామారావు తెలిపారు.

రైతుబజార్‌లో వివాదంపై ఈడీ ఆరా

సాక్షి ఎఫెక్ట్..



రైతుల గుర్తింపు కార్డులు తనిఖీ చేస్తున్న ఈడీ

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరు రైతుబజార్‌లో జరిగిన వివాదంపై ఈ నెల 11న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మార్కెటింగ్ శాఖ ఈడీ యాసీన్ స్పందించారు. ఈ మేరకు రైతుబజార్‌ను గురువారం ఆయన సందర్శించి, వివాదంపై ఆరా తీశారు. ఎస్టేట్ ఆఫీసర్ సమక్షంలో ఘర్షణ పడిన ఇద్దరినీ పిలిపించి మాట్లాడారు. సెల్‌ఫోన్ చార్జర్ విషయమై కొబ్బరికాయల వ్యాపారి తనపై చేయిచేసుకున్నాడని అరకు ప్రాంతానికి చెందిన రైతు చెప్పారు. కొబ్బరికాయల వ్యాపారి తన తప్పును ఒప్పుకుని పునరావృతం కానివ్వనని ఈడీకి హామీ ఇచ్చారు. వివాదం మధ్యాహ్న సమయంలో జరిగిందని, అప్పుడు భోజనానికి వెళ్లామని ఈవో, అటెండర్‌లు చెప్పారు. ఇదే విషయమై పలువురు రైతులను పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై జేసీకి ఈడీ నివేదిక ఇచ్చే అవకాశం ఉంది.

స్టాళ్ల పరిశీలన

అనంతరం ఈడీ యాసీన్ రైతుబజార్‌లో రైతుల గుర్తింపు కార్డులను తనిఖీ చేశారు. ఉల్లిపాయలు నాణ్యత తక్కువగా ఉండడాన్ని గుర్తించి వ్యాపారులను ప్రశ్నించారు. నాణ్యమైన వస్తువులను మాత్రమే తీసుకువచ్చి విక్రయించాలని ఆయన సూచించారు.

ఏయూ సమాచారమ్

విద్యార్థుల మెస్ పరిశీలన



మెస్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న రిజిస్ట్రార్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల హాస్టల్‌ను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా తెలుసుకున్నారు. వస్తువుల నాణ్యత నుంచి వండి, వడ్డించే వరకు తీసుకుంటున్న చర్యలను ఆయన గమనించారు. వస్తువుల సరఫరా విషయంలో ఎటువంటి రాజీ పడవద్దని అధికారులకు ఆదేశించారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారాన్ని అందించే విధంగా సిబ్బంది పనిచేయాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల నుంచి పలు సూచనలు ఆయన స్వీకరించారు. మెస్‌లో నాణ్యత ప్రమాణాలను మరింత పెంపుదల చేసే విధంగా కృషి చేస్తామన్నారు. విద్యార్థులు నేరుగా తన దృష్టికి సమస్యలు తీసుకురావచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ డాక్టర్ జి.వీర్రాజు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీమన్నారాయణ, అసిస్టెంట్ వార్డెన్ డాక్టర్ ఎస్.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్‌కు అభినందన



రిజిస్ట్రార్ జేమ్స్‌స్టీఫెన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు చేపట్టిన అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జేమ్స్ స్టీఫెన్‌ను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ అభినందించారు. గురువారం ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగ ఏయూలో జరుగుతున్న అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన జేమ్స్ స్టీఫెన్‌ను ఎమ్మెల్సీ సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

అమరవీరులకు శ్రద్ధాంజలి



డీఈఐలో అమృత కలశంతో నిర్వాహకులు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ ప్రాంతం దయాల్‌నగర్‌లో దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం అమృత కలశ కార్యక్రమం నిర్వహించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా చేతి వృత్తి కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ ఇళ్ల నుంచి తీసుకొచ్చిన మట్టిని ఆ కలశంలో వేశారు. ఆ కలశం చుట్టూ చేరి అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఆ కలశంలో మట్టిని ఉపయోగించి ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో 25 మొక్కలు నాటారు. అనంతరం అంతా ఐకమత్యంతో ఉండి దేశ సంపద రక్షించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు

- పోలమాంబ ఆలయంలో ఈ నెల 15 నుంచి వేడుకలు
- 9 రోజుల పాటు కుంకుమ పూజలు
- నిత్యం దుర్గా హోమం



పోలమాంబ అమ్మవారు



పోలమాంబ ఆలయం

ఏయూ క్యాంపస్: శరన్నవరాత్రి ఉత్సవాలకు పెదవాల్తేరులోని పోలమాంబ ఆలయం ముస్తాబవుతోంది. ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నుంచి ఆశ్వీయుజ శుద్ధ దశమి వరకు ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.గాయత్రి తెలిపారు.

- శరన్నవరాత్రి రోజుల్లో ఆలయంలో భక్తుల గోత్రనామాలతో ఉదయం, సాయంత్రం వేళల్లో లక్ష కుంకుమ పూజలు జరుపుతారు. రూ.500 టికెట్లు తీసుకుని భక్తులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనవచ్చును. వారికి అమ్మవారి ప్రసాదం అందిస్తారు. ఈ నెల 22న ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఉపాలయ మండపంలో విశేష కుంకుమ పూజలు చేయనున్నారు.
- ఆలయంలో ప్రతి రోజు శ్రీపోలమాంబ, దుర్గా హోమం నిర్వహించనున్నారు. రూ.1500 చెల్లించి భక్తులు స్వయంగా ఈ హోమంలో పాల్గొనవచ్చును. హోమానికి కావలసిన సామగ్రిని భక్తులు తీసుకురావాల్సి ఉంటుంది. రోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు హోమం చేయనున్నారు.

ప్రత్యేక అలంకరణ

- ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని ఈ నెల 15న స్వర్ణ కవచాలంకృత శ్రీ పోలమాంబగా, 16న బాలాత్రిపుర సుందరి దేవిగా, 17న గాయత్రి దేవిగా, 18న లలితా త్రిపురసుందరీదేవిగా, 19న మూలా నక్షత్రం రోజున సరస్వతీ దేవిగా, 20న అన్నపూర్ణాదేవిగా, 21న మహాలక్ష్మిగా, 22న దుర్గాదేవిగా, 23న మహిషాసురమర్దిని దేవి, రాజరాజేశ్వరిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు.

సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు

ప్రతి రోజు ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక వేదికపై శాస్త్రీయ నృత్యాలు, ఆధ్యాత్మిక సంగీత విభావరి నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సంకీర్తన, భజన కార్యక్రమాలు, సాయంత్రం 6 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.

మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం



మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ చందర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ

మద్దిలపాలెం : పార్టీని నమ్ముకుంటే ఎప్పటికైనా సరైన గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. గురువారం తనను మర్యాద పూర్వకంగా కలిసిన రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్‌ను ఆయన సత్కరించారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వంశీకృష్ణ సూచించారు. అలాగే వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడిగా నియామకమైన 15వ వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్‌ను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు, అల్లంపల్లి రాజురాజు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ఐపీఎస్ అధికారి శివగామి



శివగామికు జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో భ్రమరాంబ

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం స్పెషల్ సెక్రటరీ డీజీపీ మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ శివగామి సుందర్‌నందా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి, వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆమెకు స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను ఏఈవో భ్రమరాంబ అందజేశారు.